రికార్డులను పక్కాగా సేకరించాలి

–జిల్లా విజిలెన్స్ అధికారి కొండయ్య

యాచారం, ఏప్రిల్17: త్వరలో జరిగే జాతీయ ఉపాధి హామి పథకం సోషల్ ఆడిట్ కోసం రికార్డులను, పనులకు సంబంధించిన వివరాలను పక్కగా సేకరించాలని జిల్లా విజిలెన్స్ అధికారి కొండయ్య అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ..మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై త్వరలో సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికోసం అధికారులు, సిబ్బంది మండలంలో చేపట్టిన పనులు, పని చేసిన కూలీలు, చెల్లించిన బిల్లులకు సంబందించిన పూర్తి సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో సేకరించి నివేదికను పకడ్బందీగా తయారు చేయాలన్నారు. మండలంలో నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో మండల సమాచారం మొత్తాన్ని ప్రజలు, కూలీల ముందుంచాలని కోరారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి కొండయ్య

అధీకృత డీలర్లు నియమ నిబంధనలు పాటించాలి

–జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు.

ఆమనగల్లు, ఏప్రిల్ 17: విత్తన,ఎరువుల డీలర్లు నిబంధనలు అతిక్రమించి విక్రయాలు జరిపితే లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఏవో ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు,బిల్లు బుక్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన డీలర్లతో మాట్లాడుతూ లైసెన్స్‌లు, స్టాక్ బోర్డు , ధరల పట్టికలు ప్రతి షాపులో ఏర్పాటు చేయాలని డీలర్లకు సూచించారు. రైతులకు సంతకం చేసిన బిల్లులు ఇవ్వాలని, కాలపరిమితి దాటిన సరుకులను ఉంచరాదని పేర్కొన్నారు. ఎరువులు, విత్తన నిల్వలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన తెలిపారు. ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విత్తనాలు, ఎరువులు విక్రయించాలని డీలర్లు ఎవరైన వ్యవసాయ శాఖ నియమ నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. వచ్చే వానకాలానికి సరిపడా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు ముందుగా తెచ్చుకోవాలని ఏవో శ్రీనివాస్ గౌడ్‌కు ఆయన సూచించారు.

ఆమనగల్లులోని ఓ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహరావు

భూభారతిపై అవగాహన సదస్సు

పూడూరులో భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన స్పీకర్ ప్రసాద్ కుమార్, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు

పరిగి, ఏప్రిల్ 17 : భూముల ఆసాములకు పూర్తి భద్రత కల్పించేది భూ భారతి చట్టం అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ చట్టం సామాన్య ప్రజలకు భరోసా కల్పిస్తుందని చెప్పారు. పూడూరు మండల కేంద్రంలో గురువారం జరిగిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పేదోళ్ల కష్టాలు నెరవేర్చడం కోసమే ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. గ్రామాలకే రెవెన్యూ సిబ్బంది వస్తారని, భూ సమస్యలను వారి దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. ఈ చట్టం ద్వారా సాదాబైనామాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోబోతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇళ్లు ఉన్నా, వాటికి డాక్యుమెంట్‌లు లేవని, ఈ చట్టం ద్వారా భూములన్ని రెగ్యులరైజ్ చేసి డాక్యుమెంట్‌ను ఇవ్వడం జరుగుతుందని మంత్రి చెప్పారు. ప్రభుత్వ భూములు పేదల చేతుల్లో ఉంటే, వారు అర్హులైతే వారికి పట్టాలు ఇవ్వడానికి సైతం వెనుకడుగు వేసేది లేదన్నారు. జిల్లా కలెక్టర్ రోజుకు రెండు మండలాల చొప్పున, ఉదయం ఒక మండలంలో నాలుగైదు గంటలు, సాయంత్రం మరో మండలంలో నాలుగైదు గంటలు కలెక్టర్ ఆధ్వర్యంలోనే అవగాహన సదస్సులు జరుగుతాయని మంత్రి చెప్పారు. వచ్చే నెల మొదటి వారంలో 28 జిల్లాల్లో, ప్రతి జిల్లాకు ఒక మండలాన్ని మోడల్‌గా తీసుకుంటామని తెలిపారు. తరతరాలుగా వస్తున్న భూములకు డాక్యుమెంట్‌లు లేని వారికి, పాసు పుస్తకం ఉండి, భూమి తక్కువగా ఉన్నా, పేర్లు తప్పుగా పడినా, ఏరియా తప్పుగా పడినా వాటన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. జూన్ 2 నుంచి అన్ని మండలాల్లోని గ్రామాలకు రెవెన్యూ అధికారులు వచ్చి, సమస్యలు అక్కడే పరిష్కరిస్తారన్నారు. ఆగస్టు 15వ తేదీ వరకు భూములున్న రైతులకు భద్రత, భరోసా కల్పించడం కోసమే ఈ చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. పూడూరు మండలకేంద్రం చీలాపూర్ గ్రామంలో 281 సర్వే నెంబర్లో 850 ఎకరాల భూమి ఉండగా, 270 మంది పట్టాదారు రైతులు ఉన్నారు. భూముల రీ సర్వేపై రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై రైతులు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ద్వారా మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లగా విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. అనంతరం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందన్నారు. భూ భారతి అమలుతో రాష్ట్రంలోని 70లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఏమైనా అనుమానాలుంటే రెవెన్యూ అధికారులను కలిసి నివృత్తి చేసుకోవచ్చని అన్నారు. ఈ ప్రభుత్వం పూడూరు మండలంలోని దామగుండంలో నేవీ రాడార్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేసిందన్నారు. శాసనమండలిలో చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని చెప్పారు. ప్రభుత్వ భూమి ఉంటే పేదలకు ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరికి రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేకుండానే భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని చెప్పారు. పాలమూర్–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కెపి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, తద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సాగునీరు అందనుందన్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న 30 రోజులలో పరిష్కారం అయ్యేలా చట్టం తీసుకువచ్చారని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ భూ భారతి చట్టం విధి విధానాలను రైతులకు తెలియజేశారు. అంతకుముందు పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.40లక్షలతో కల్పించిన అదనపు సదుపాయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డీవో వాసుచంద్ర, తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అమర్నాథ్ యాత్రికులకు.. గాంధీలో ఫిట్నెస్ సర్టిఫికెట్ల జారీ

బన్సీలాల్ పేట్, ఏప్రిల్ 17 : హిమాలయ పర్వతాల పై ఉన్న అమర్నాథ్ యాత్రకు వెళ్లే వారికి సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో ఫిట్నెస్ సర్టిఫికెట్లను ఉచితంగా జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఏప్రిల్ 21వ తేదీ నుంచి ప్రతి సోమ, బుధ, శుక్ర వారాలలో ఉదయం 10:30 గంటలకు ప్రధాన భవనం, మొదటి అంతస్తులోని మెడికల్ రికార్డ్స్ డిపార్ట్మెంట్‌లో ఈ సర్టిఫికెట్ పొందవచ్చు. ఇందుకోసం దరఖాస్తు తో పాటు రక్త పరీక్షలు, చాతి ఎక్స్‌రే, బ్లడ్ గ్రూపు పరీక్షల రిపోర్ట్‌లను తీసుకుని రావాలని, 50 ఏళ్ల వయస్సు పైబడిన వాళ్లు తప్పనిసరిగా రెండు మోకాళ్ల ఎక్స్‌రేలను తీసుకొని రావాలని అధికారులు తెలిపారు. సర్టిఫికెట్ల జారీ కోసం డీఎం నియమించిన వైద్యులు డాక్టర్ బీ కిరణ్ (ఆర్థోపెడిక్), డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి (కార్డియాలజీ), డాక్టర్ భానుప్రియ (పల్మానాలజీ), డాక్టర్ కృష్ణ నాయక్ (జనరల్ మెడిసిన్) వైద్యుల బృందం సిద్ధంగా ఉంటారని తెలిపారు. సర్టిఫికెట్ల జారీ పూర్తిగా ఉచితమని.. ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి

సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్ఓ అనురాగ్ జయంతి

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి పోలింగ్, కౌంటింగ్ అధికారులకు సూచించారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం ఉదయం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపీ ఓలకు రెండో విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి డాక్టర్ సునంద రాణి, మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి, ఈఈ మమత, పోలింగ్ పీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి ఎంబీఏ ఇంటర్నల్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ ఇంటర్నల్ పరీక్షలు 21వ తేదీ నిర్వహించాలని బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం హెడ్ ప్రొఫెసర్ జహంగీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ రెండవ ఇంటర్నల్ పరీక్షలను 26వ తేదీలోగా, రోజుకు రెండుకు మించకుండా నిర్వహించాలని కళాశాలల నిర్వహకులకు సూచించారు. ఇంటర్నల్ పరీక్షలకు నూతన విధానాన్ని రూపొందించినట్లు చెప్పారు. కళాశాలల యాజమాన్యాలకు ఏవైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

కొత్త చట్టంతో సమస్యలకు పరిష్కారం

షాద్‌నగర్, కేశంపేటలలో భూభారతిపై అవగాహన సదస్సుల్లో రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఫిర్యాదుదారులను అనుమతించని ఎమ్మెల్యే గన్‌మెన్

షాద్‌నగర్/కేశంపేట, ఏప్రిల్ 17: భూమి హక్కుల రికార్డుగా భూభారతి పోర్టల్ చట్టం రూపాంతరం చెందిందని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీతోపాటు కేశంపేటలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పిస్తూ కొత్త చట్టాన్ని రూపొందించారన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం గతంలో కలెక్టర్‌కు మాత్రమే అధికారాలు ఉండేవని, ప్రస్తుత చట్టంవల్ల తహశీల్దార్, ఆర్డీవోలకు సైతం అధికారాలు కట్టబెట్టడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని, అధికారులు ఏదైనా పొరపాటు చేస్తే అప్పిల్‌కు వెళ్లవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత, మండల ప్రత్యేకాధికారి రాజారత్నం, స్థానిక తహసీల్దార్ ఆజంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, ఎంఈవో చంద్రశేఖర్, డీటీ గీత, ఆర్ఐ నివేదిత, రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులను ఆపివేసిన ఎమ్మెల్యే గన్‌మెన్..

జిల్లా కలెక్టర్ వస్తారన్న సమాచారం ముందుగానే తెలియడంతో కేశంపేట మండలంలోని పలు గ్రామాల నుంచి బాధితులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చారు. బాధితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యక్తిగత గన్‌మెన్ అడ్డుకోవడం కనిపించింది. ఫిర్యాదుదారులెవరినీ ఎవరిని అనుమతించవద్దని కేశంపేట పోలీసులకు ఎమ్మెల్యే గన్‌మెన్ హుంకుంజారీ చేయడంతో స్థానిక పోలీసులు ఎవరినీ కలెక్టర్ దగ్గరకు వెళ్లనివ్వలేదు. దీంతో చేసేదిలేక బాధితులు నిట్టూరుస్తూ వెనుదిరిగారు.

కేశంపేటలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మెట్రో ప్రయాణం భారం?

టికెట్ ధరల పెంపుపై ఎల్ అండ్ టీ కసరత్తు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : ఇకపై హైదరాబాద్ మెట్రో ప్రయాణం భారం కానున్నది. టికెట్ ధరలు పెంచడానికి ఎల్అండ్‌టీ సిద్ధమైంది. ఇప్పటికే టికెట్ కనిష్ఠ ధర రూ.10 గరిష్ఠ ధర రూ.60 ఉండగా అదనంగా ధరలు పెంచడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. టికెట్ ధరలు పెంపునకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు సమాచారం. రోజుకు 5.10 లక్షల మంది ప్రయాణాలు చేస్తున్నప్పటికీ నష్టాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అందులో భాగంగా ఎల్అండ్‌టీ అధికారులు టికెట్ ధరల పెంపుపై చర్చిస్తున్నారు. ఎంత పెంచాలి? ఒకేసారి పెంచాలా లేదా విడతల వారీగా పెంచాలా? తదితర వాటిపై విస్తృతంగా చర్చిస్తున్నారు. ఇప్పటికే రూ.59 హాలిడే సేవర్ కార్డును ఎత్తివేసిన విషయం తెలిసిందే. దీంతో పాటు మెట్రో కార్డుపై రద్దీవేళల్లో 10 శాతం రాయితీని సైతం విరమించుకున్నారు. ఇప్పటికే ప్రయాణికులు ప్రస్తుతం ఉన్న టికెట్ ధరలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయితీలు ఎత్తేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి క్రమంలో మెట్రో టికెట్ ధరలు పెంచితే ప్రయాణికులు ఎలా స్పందిస్తారో చూడాలి.

చార్జీల పెంపునకు నో చెప్పిన కేసీఆర్ సర్కార్..

కరోనా విపత్కర సమయాల్లో తీవ్రంగా నష్టపోయామని టికెట్ ధరలు పెంచడానికి అనుమతినివ్వాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని 2022లో కోరిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి.. చార్జీలను సవరించాలని ప్రతిపాదించింది. కానీ ప్రయాణికులపై భారం మోపడం సరైనది కాదని.. అప్పటికీ కొవిడ్ ప్రభావం కొనసాగుతున్న దరమిలా కేసీఆర్.. మెట్రో అధికారుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోలేదు. కాగా, ప్రస్తుతం వరకు మెట్రో రైలు నష్టాలు రూ.6,500 కోట్లకు చేరాయని అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఆదాయ మార్గాలను మెరుగుపరచుకున్నా.. నష్టం కొనసాగుతుందని వివరించారు. అందులో భాగంగా మెట్రో ధరల పెంపుకు రంగం సిద్ధమైనట్టు అధికారులు చెబుతున్నారు.

శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్

కొండాపూర్, ఏప్రిల్ 17 : మాదాపూర్‌లోని శిల్పారామంలో ప్రతి సంవత్సరం నిర్వహించే సమ్మర్ ఆర్ట్ క్యాంప్ ఈ ఏడాది మే 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్ రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మట్టికుండలు తయారు చేయడం (పాటరి), పెన్సిల్ స్కెచ్, మధుబనీ పెయింటింగ్, ట్రైబల్ పెయింటింగ్, మండల పెయింటింగ్, అక్రలిక్ పెయింటింగ్, సిషెల్ క్రాఫ్ట్, భగవద్గీత శ్లోకాలు, సంస్కృతంలో మాట్లాడటం వంటి అంశాలలో నామమాత్రం రుసుముతో శిక్షణ ఇస్తారన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఆసక్తిగల వారందరూ పాల్గొనవచ్చని.. వివరాలకు 88866 52030, 88866 52004 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీఎస్ఎన్ఎల్ క్యాంపునకు విశేష స్పందన

సిటీబ్యూరో, ఏప్రిల్17, (నమస్తే తెలంగాణ): వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గురువారం విజయనగర్ కాలనీలో బీఎస్ఎన్ఎల్ ఏర్పాటు చేసిన వినియోగదారుల సర్వీస్ క్యాంపునకు విశేష స్పందన వచ్చింది. బీఎస్ఎన్ఎల్ హైదరాబాద్ సెంట్రల్ డిప్యూటి జనరల్ మేనేజర్ రామానందం మాట్లాడుతూ..వినియోగదారుల సమస్యలు, సలహాలు పరిగణలోకి తీసుకొని వారికి మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఈ సర్వీస్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. సేల్స్ ఏజీఎం శ్రీనివాస్, సైఫాబాద్ ఏజీఎం వసంత, చీఫ్ అకౌంట్ అధికారి కళ్యాణి పాల్గొన్నారు.

హామీలపై ప్రశ్నించడం తప్పా?

- రసాభాసగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రసంగానికి అడుగడుగునా అడ్డుపడిన కాంగ్రెస్ నేతలు
- ప్రతిగా బీఆర్ఎస్ నేతల నినాదాలు



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు

కందుకూరు, ఏప్రిల్ 17: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన ఆపార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని ప్రశ్నించడం తప్పా అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందని సబితారెడ్డి విమర్శించారు. గురువారం కందుకూరు మండల పరిషత్ సమావేశపు హాలులో 105 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీస్తుండగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇచ్చిన హామీలపై విమర్శలు చేయడంతో పాటు ఎమ్మెల్యే ప్రసంగానికి అడ్డుపడటంతో.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇదికాస్తా ఒకరిపై ఒకరు చేయి చేసుకునే స్థాయికి దారి తీసింది .ఇరు వర్గాలను పోలీసులు సముదాయించి సమావేశం హాలులో నుంచి బయటకు పంపించారు. అనంతరం చెక్కుల పంపిణీ యథావిధిగా కొనసాగింది.

ప్రభుత్వానికి భంగపాటు తప్పదు..

అనంతరం కందుకూరులో ఎమ్మెల్యే సబితారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రైతులకు రుణమాఫీ చేయలేదని, రైతుబంధు రెండు పంటలకు ఎగనామం పెట్టిందని విమర్శించారు. తల్లిదండ్రులకు భారం కావద్దని కేసీఆర్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి అండగా ఉంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఇప్పుడు చెక్కులు ఇస్తున్న వారితో పాటు ఇక మీదట కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి త్వరలో ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్, బీఆర్ఎస్ నాయకులు.. సురసాని సురేందర్ రెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, సామ మహేందర్ రెడ్డి, సురసాని రాజశేఖర్ రెడ్డి , మేఘనాథ్ రెడ్డి, చంద్రశేఖర్, ఆనంద్, దేవీలాల్ నాయక్, ఇందిరమ్మ దేవేందర్, మాజీ సర్పంచ్‌లు గోపాల్ రెడ్డి, జ్యోతి , జంగయ్య ,చంద్రశేఖర్, పుల్లారెడ్డి, డైరెక్టర్ ఆనంద్, మాజీ డైరెక్టర్ పారిజాతం, దేవిలాల్ నాయక్, ప్రకాశ్ రెడ్డి, చంద్రశేఖర్, యూత్ నాయకులు.. కార్తీక్, బొక్క దీక్షిత్ రెడ్డి పాల్గొన్నారు.

కుళ్లిన పండ్లు, పాడైన సలాడ్

- అపరిశుభ్రమైన వాతావరణం, కుళ్లిన పండ్లతో జ్యూస్ తయారీ
- ఈగల మోత, బొద్దింకల దాడి
- లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం
- అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- జ్యూస్ సెంటర్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో విస్తుపోయే నిజాలు
- నిర్వాహకులకు నోటీసులు

అమీర్‌పేట్‌లో అధికారులు దాడులు నిర్వహించిన జ్యూస్ దుకాణం. (ఇన్‌సెట్‌లో) షాప్‌లోని ఐస్ బాక్స్‌లో ఎలుకలు, పురుగులు, జ్యూస్ జార్లపై ఈగలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): జ్యూస్ ఆరోగ్యకర పానీయం.. యాంటీ ఆక్సిడెంట్లు, మైక్రోన్యూట్రియెంట్లు, పాలీఫెనాల్స్, అంథోసైనిన్‌లు అధికంగా ఉండటం వలన ఇది ఆరోగ్యకమైన పానీయంగా పరిగణించబడుతుంది. ఎన్నో ఆరోగ్యకర ప్రయోజనాలున్న ఈ జ్యూస్‌లను చాలా మంది రోడ్ల వెంట ఉండే జ్యూస్ బండ్ల దగ్గర, కాలనీల్లో జ్యూస్ సెంటర్ల వద్ద ఇష్టంగా తీసుకుంటుంటారు. . దీనిని అసరాగా చేసుకుంటున్న కొందరు జ్యూస్ సెంటర్ల నిర్వాహకులు డబ్బులు దండుకోవడమే లక్ష్యంగా ఆర్యోగ ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారు. అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించి అపరిశుభ్రమైన వాతావరణం, కుళ్లిన పండ్లతో జ్యూస్‌లు సిద్ధం చేస్తున్నారు. జ్యూస్‌లో వినియోగించే పాలు, ఐస్‌లు ప్రమాదకరంగా ఉంటున్నాయి. అమీర్‌పేట కేంద్రంగా పలు జ్యూస్ సెంటర్లపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించగా కళ్లు చెదిరే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఏ ఒక్క సెంటర్ నిర్వాహకులు పరిశుభ్రత లేకుండా జ్యూస్‌లను కస్టమర్లకు ఇస్తున్నట్లు తేల్చారు. తనిఖీల్లో భాగంగా వెంగళ్‌రావు నగర్ కాలనీలోని ఏ 1 ఫ్రూట్ అండ్ జ్యూస్ షాప్‌లో అడుగడుగునా అపరిశుభ్రమైన వాతావరణంలో జ్యూస్‌ల తయారీ ఉన్నట్లు గుర్తించారు. తయారీ ప్రాంతంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. రిఫ్రిజిరేటర్ తుప్పు పట్టి ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా ఇనుప కత్తులు పూర్తిగా తుప్పు పట్టినట్లు , చెత్త బుట్టల తెరిచి ఉండటంతో ఈగలధాటి ఉన్నట్లు తేల్చారు. అమీర్‌పేట ప్రధాన రహదారిలో వింటారా కాంప్లెక్స్‌లోని కోకనట్ జ్యూస్ బార్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. రిఫ్రిజిరేటర్‌లో కుళ్లిన పండ్లు,తయారీ ప్రాంతంలో ఏ మాత్రం శుభ్రత లేదని తేల్చారు. అనంతరం అమీర్‌పేటలోని ప్రభుత్వ దవాఖానా ఎదురుగా కేజీఎన్ జ్యూస్ సెంటర్ నిర్వాహకులు లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. రిఫ్రిజిరేటర్ చాలా అపరిశుభ్రమైన స్థితిలో ఉందని, జ్యూస్ తయారీ చేసే ప్రాంతంలో ఈగల మోత ఉన్నట్లు తేల్చారు. ఫ్రిజ్‌లో పాడైన ఫ్రూట్ సలాడ్‌ను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అమీర్‌పేటలోని తిరుమల టవర్స్‌లోని నేచురల్ ఫ్లేవర్‌లో అపరిశుభ్రత వాతావరణంలో ఉన్నట్లు తేల్చారు. పైనాపిల్ క్రష్, బ్లాక్ కరెంట్ క్రష్, అరెంజ్, బ్లూ కర్రాకో, అరటిపండ్లు తదితర పండ్లు పాడైనట్లు గుర్తించారు. సోడా బాటిళ్లపై లేబుల్ సరిగా లేవని, ఫ్రిజ్‌లో బొద్దింకలు ఉన్నాయని, పనిచేసే సిబ్బంది ఎలాంటి పరిశుభ్రమైన నియమ నిబంధనలు పాటించలేదని తేల్చారు. ఆనంతరం ఆమీర్‌పేట మెట్రో పిల్లర్ నంబర్ 1443 బొంబాయి జ్యూస్ సెంటర్‌లో శుభ్రత లేదని తేల్చారు. కుళ్లిన పండ్లు, కూరగాయాలు ఉన్నాయని, ఫ్యాన్లు దుమ్ము పట్టి ఉన్నాయని, గుర్తించారు. నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని, శ